క్లుప్తంగా

చదువుతోనే సమాజంలో గుర్తింపు



సౌండ్ సిస్టమ్, సీసీ కెమెరాలను అందజేస్తున్న గఫార్

గజ్వేల్‌రూరల్: చదువుల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ప్రభుత్వ పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు మహ్మద్ గఫార్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల కోసం రూ.లక్షా 30వేల విలువ చేసే సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ కనెక్షన్, సౌండ్ సిస్టమ్‌ను ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ సందర్భంగా గఫార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన పలువురు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు గఫార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

దేవాలయ ఆస్తుల బాధ్యత అందరిది



మాట్లాడుతున్న ఆలయ ఆస్తుల పరిరక్షణ సమితి నాయకులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన ఐదు ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని ఆలయ ఆస్తుల పరిరక్షణ సమితి నాయకులు మల్లేశం, శేఖర్ కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఆలయం పేరుపై ఉన్న భూమిలో నాలుగు ఎకరాల భూమిని కొందరు వారి పేరు పైన మార్చుకుని అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయం నిర్మాణం నుంచి ఇప్పటివరకు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తి ధర్మకర్తగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించారు. దాతలు, ప్రజల సహాయంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను కాపాడాలని విన్నవించారు. ఆలయ అభివృద్ధికి త్వరలో నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో వేణుగోపాల్, శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్: పట్టణంలో బేడ బుడిగ జంగాల కాలనీవాసుల ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంబాల పూజారులు చెప్పిన కథలు అందరిని ఆకట్టుకున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ కౌన్సిలర్లు మిరియాల రమేష్, వల్లపు రాజు, అయిలేని శంకర్ రెడ్డి, బుడిగ జంగాల నాయకులు పాల్గొన్నారు.

గోపిశెట్టి శరభయ్య సేవలు గొప్పవి

మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్



శరభయ్యను సన్మానిస్తున్న ఫారుఖ్ హుస్సేన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శబరిగిరీశా సేవా సమితి అయ్యప్ప ఆలయ అధ్యక్షుడు గోపిశెట్టి శరభయ్య చేస్తున్న సామాజిక సేవలు గొప్పవని, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్ష పదవికి ఎన్నికైన సందర్భంగా బుధవారం, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ. గోపిశెట్టి శరభయ్య కొన్ని సంవత్సరాలుగా పలు సేవా సంస్థల్లో సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు కాశీనాథ్, పీఆర్‌టీ డాక్టర్ నవీన్‌కుమార్, వెంకటేశం, నాగరాజు, నాగేందర్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల చూపు.. నానో వైపు

- యూరియా కొరతతో ద్రవరూప ఎరువుల వినియోగం
- బాటిల్స్ ఎరువులతో డబ్బులు ఆదా
- రైతులకు తగ్గుతున్న పెట్టుబడి భారం
- అవగాహన కల్పించడంలో నిమగ్నమైన అధికారులు



వరిపొలంలో నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తున్న రైతు

కోహెడ(హుస్నాబాద్): ఎరువుల వాడకంలో మార్పులు వచ్చాయి. ఇంతవరకు బస్తాల్లో ఘన రూపంలో లభించే యూరియా, డీఏపీ ప్రస్తుతం ద్రవరూపంలో మార్కెట్‌లోకి వచ్చింది. 50 కిలోల డీఏపీ బ్యాగు మార్కెట్‌లో రూ.1350, యూరియా బ్యాగు రూ.266 ఉంది. ఇఫ్కో కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అర లీటరుకు రూ.600, యూరియా రూ.240 ధరలతో మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ఎకరానికి ఒక డీఏపీ బ్యాగు, యూరియా బ్యాగును మోతాదుగా రైతులు వినియోగిస్తారు. వీటికి బాదులుగా అరలీటరు ద్రవరూపం యూరియా సరిపోతుంది. దీంతో రైతులకు డబ్బులు ఆదా అవుతుంది.

ద్రవరూప ఎరువులతో మేలు

ద్రవరూప ఎరువుల వినియోగంతో రైతులకు మేలు జరుగుతుంది. అధికారుల అంచన ప్రకారం ద్రవరూప ఎరువుల వాడకం ద్వారా పంటకు లభ్యత సుమారు 90 శాతం ఉంటుందని చెబుతున్నారు. డీఏపీ వరినాటు వేసిటప్పుడు బస్తా డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తామో.. ద్రవరూప డీఏపీ అర లీటరు పొలంలో పిచికారీ చేయాలి ద్రవరూప ఎరువులను పంటకు పిచికారీ చేయటం వల్ల మొక్కలు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ.. ఆకుల్లో కిరణ జన్య సంయోగక్రియ పెరుగుతుంది. మొక్క వేర్లలో కణజలం వృద్ధి చెంది.. పంట ఉత్పత్తిలో పోషక విలువలను పెంచుతుంది.

రైతులకు అవగాహన

గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించటంలో మండల వ్యవసాయ అధికారులు నిమగ్నమైయ్యారు. నానో డీఏపీ, యూరియా మార్కెట్‌లో ఉందని వాటి ప్రయోజనాన్ని వివరిస్తున్నారు. ప్రస్తుతం యూరియా, డీఏపీ కొరతను అధిక మించేందుకు నానో డీఏపీ, యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

అధిక దిగుబడి వస్తుంది



వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ తదితర పంటల సాగుకు నానో యూరియా, డీఏపీ వాడకం ద్వారా రైతులకు అధిక దిగుబడి వస్తుంది. భూసారాన్ని కాపాడుతుంది. గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. పంటలకు తెగుళ్లను నివారిస్తుంది. అగ్రోస్, డీసీఎంఎస్, ఆకా, షాపులకు స్టాక్ అందుబాటులో ఉంచాం.

– శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

శెట్టిపల్లి సత్తిరెడ్డి



వరిపంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): నకిలీ ఎరువులు వాడి పరి పంటలు నష్టపోయిన రైతులకు ఆ కంపెనీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గౌరయపల్లిలో నకిలీ ఎరువులు వాడిన కొయ్యడ శ్రీనివాస్ వరి పొలాన్ని సీపీఎం మండల నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో నకిలీ ఎరువుల విక్రయం వ్యవసాయ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని మండిపడ్డారు. ఎరువుల దుకాణాదారులు టన్నుల కొద్ది నకిలీ ఎరువుల విక్రయం జరిపినా వ్యవసాయ అధికారులు 20నుంచి 30 బస్తాలు మాత్రమే విక్రయించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంట నష్టపోయిన రైతులకు యాజయాన్యం ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు దాసరి ప్రశాంత్, మండల నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దుబ్బాక: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని 120 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చాలా అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైన ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం పేద కుటుంబాలకు వైద్యపరంగా చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలి

సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బాలలత

గజ్వేల్‌రూరల్: క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగినపుడే విజయం వరిస్తుందని, సోషల్ మీడియాను మంచి ప్రయోజనాలకు వినియోగించుకోవాలని సీఎస్‌బీ ఐఏఎస్ డైరెక్టర్ బాలలత పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్‌స్పైర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు చదువుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే నిరంతరం క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా నిరుత్సాహ పడకుండా ధైర్యంగా లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఎంతో కష్ట పడుతుంటారని, వారి ఆశలను అడియాసలు చేయకుండా ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనిత అబ్రహం, ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రిన్సిపల్ వినోద్ కేతోజీ, జనరల్ సెక్రటరీ కరుణాకర్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

హాజరు రెండుసార్లు నమోదు చేయాలి

అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్‌గౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధిహామీ కూలీల హాజరు తప్పకుండా రెండుసార్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కార్యాలయం ఎదుట ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా మండలంలోని 29 గ్రామాలకు సంబంధించిన ఉపాధి పనుల వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒకరికి వంద రోజుల పని కల్పించాలని కోరారు. కూలీల హాజరును ఉదయం, సాయంత్రం తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వన మహోత్సవంలో మండలాన్ని ముందంజలో ఉండేలా మొక్కలు నాటాలని కోరారు. పనుల్లో అవినీతికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ సతీష్, సంతోష్, ఎంపీడీఓ రాంరెడ్డి, ఏపీఓ శైలజ, ఎంపీఓ ఖాజా, కార్యదర్శిలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్, చీకోడ్, ఆరెపల్లి, శిలాజీనగర్, రామక్కపేట, తిమ్మాపూర్, పెద్దగుండవెల్లి గ్రామాల్లోని బుధవారం అంగన్‌వాడీ సెంటర్‌ల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలే పట్టాలని, ముర్రుపాలు పట్టడం వల్ల బిడ్డకు టీకా లాగా పని చేస్తోందన్నారు. వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలే పట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం శైలజ, ఆయాలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలు, ప్రభుత్వ కార్యాలయ వద్ద అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకోసం ముందుకు సాగుతామన్నారు.



సిద్దిపేటకమాన్: పోలీసులు, సిబ్బంది నివాళి



గజ్వేల్‌లో..



మద్దూరులో..



దుబ్బాక: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



సిద్దిపేటజోన్: సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స్



ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో...



చిన్నకోడూర్‌లో..

సంక్షిప్త వార్తలు

◆ కార్మికుల ముందస్తు అరెస్ట్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులను బెజ్జంకి ఎస్ఐ సౌజన్య ముందస్తు అరెస్ట్ చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా 26 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

◆ 78 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ..పోలీసు కమిషనరేట్ పరిధిలో బుధవారం సా. 5నుంచి రాత్రి 8గంటల వరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 78మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించని వారిపై 437కేసులు నమోదు చేసినట్లు వివరించరారు.

◆ విద్యార్థుల హాజరు పెంచాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల హాజరు పెంచాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలుర కళాశాలను ఆయన తనిఖీ చేసి కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని, విద్యార్థుల హాజరు పెంచి విద్యాబోధన చేయాలని లెక్చరర్లకు సూచించారు.

◆ సగం జీవితం.. జైలు, కోర్టుల చుట్టే

దుబ్బాక: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తమపై అడుగడుగునా నిర్బంధాలు.. కేసులతోనే జైలు,కోర్టుల చుట్టూ తిరిగేందుకే సగం జీవితాలు గడచిపోతున్నాయని దుబ్బాక నియోజకవర్గం బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన ఆందోళనలకు సంబంధించి నియోజకవర్గంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారీ, సుభాష్‌రెడ్డి, సుంకోజి ప్రవీణ్, శ్రీకాంత్‌యాదవ్, మట్ట మల్లారెడ్డితో పాటు 55 మంది హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. గతంలో ప్రజలకు మద్దతుగా ధర్నాలు, ఆందోళనలు చేస్తే ఎంపీ రఘునందన్‌రావుతో పాటు తమపై అక్రమంగా కేసులు బనాయించిందని ఆరోపించారు. జైలు జీవితాలు అనుభవించ డమే కాకుండా కోర్టుల చుటూ తిరగడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

◆ పంటలకు మాత్రమే యూరియా వాడాలి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న యూరియాను వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి అన్నారు. బుధవారం రూరల్, నారాయణరావుపేట మండలాల పరిధిలోని కోళ్ల దాన పరిశ్రమ, రైస్‌మిల్లు, పౌల్ట్రీ ఫాంలను వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌శాఖల సమన్వయంతో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయానికి వాడాల్సిన యూరియాను ఇతర పరిశ్రమ అవసరాలకు వాడుతున్నారన్న ఫిర్యాదుతో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించించారన్నారు. ఈ క్రమంలో ఎలాంటి వ్యవసాయ సంబంధ యూరియా వాడటం లేదని తనిఖీల్లో గుర్తించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై రాజేష్



మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సిద్దిపేటరూరల్: విద్యార్థులు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ చెల్లింపులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.రాజేష్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. అవసరం మేరకే ఫోన్ వాడాలని అపరిచిత ఫోన్లకు స్పందించవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 100 లేదా 1930 సైబర్ సెల్ జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ విషయాలను ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పరమేశ్వరి, ప్రిన్సిపాల్ రవీందర్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



ఊరేగిస్తున్న సంతోషిమాత ఉత్సవ విగ్రహం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయ 33 వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాలు ముగిశాయి. మంగళవారం రాత్రి అమ్మవారి రథోత్సవం బాజాభజంత్రీలతో, మహిళా పారాయణాలతో, భక్తుల కేరింతలతో పట్టణ వీధుల గుండా పట్టణ ప్రజలకు అమ్మవారు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలికారు.

పీహెచ్‌సీల ప్రారంభానికి సిద్ధం చేయండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లాలో నిర్మాణం పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్‌లను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం పీహెచ్‌సీ, బస్తీ దవాఖాన, సీహెచ్‌సీ, సబ్- సెంటర్‌ల్లో మేజర్ మైనర్ రిపేర్లు, నిర్మాణంలో ఉన్న భవనాల పనుల పురోగతిపై మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ రాజ్ ఇంజనీర్, మున్సిపల్ ఇంజనీర్ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని తోటపల్లి, వర్గల్, గట్ల మల్యాల సబ్ సెంటర్ల భవనాలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో సౌకర్యాలు సమకూర్చి ప్రారంభానికి సిద్ధం చేయాలని డీఎంహెచ్ఓ ధనరాజ్‌ను ఆదేశించారు. ఎలక్ట్రిక్, రూఫ్ లీకేజీ, మరుగుదొడ్ల రిపేర్లు, కాంపౌంట్ వాల్, వాటర్ సమస్యలు వంటి పనులకు బడ్జెట్ ప్రకారం వేగంగా పూర్తి చేయాలని ఏఈలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ధనరాజ్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఈఈ శ్రీనివాస్, ఎస్ఈ చిరంజీవులు, టీజీ ఎంఐడిసి ఈఈ, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కొండపాక(గజ్వేల్): మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. కొండపాకలోని జ్యోతిబా పూలే, బీసీ బాలుర గురుకుల పాఠశాలను, హాస్టల్స్‌ను బుధవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి పూట విద్యార్థులకు అందే భోజనాన్ని, కూరగాయల స్టోర్ రూంను పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందుతుందాని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటజోన్: పట్టణంలోని బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాసర్‌పూర నర్సరీని సందర్శించారు. వనమహోత్సవంలో భాగంగా పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం అక్కడి రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌ను తనిఖీ చేశారు. పారిశుద్ధ్యలోపం, నిర్వహణ వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. భోజన నాణ్యత, వంటగది పరిశీలించారు. అనంతరం నాసర్ పూర ఓపెన్ జిమ్ పరిశీలించారు. అక్కడి పరికరాలను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశంలో చెత్త ఉండటంతో మండిపడ్డారు. చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు.